# నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికాం ఎంప్లాయీస్ - బి.ఎస్.ఎన్.ఎల్.

(రిజిష్టర్ నెం. 4906)

## తెలంగాణ సర్కిల్ బ్రాంచ్ - హైదరాబాద్

డోర్ నెం. 3-4-1013/9, టెలికం హౌస్, హైదరాబాద్ - 500027.

సర్క్యులర్ నెం.16/2018

తేదీ.12-12-2018

## క్రిస్టమస్ పండుగ శుభాకాంక్షలతో ...

క్రామ్రేడ్,

## ది.03-12-2018 నుండి జరగవలసిన సమ్మెను ఎందుకు వాయిదా వేశారు?

ఈ ప్రశ్న చాలా ప్రచారంలో ఉన్నది. బాధ్యత లేని వారు కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఏ.యు.ఎ.బి. నాయకులు తప్పుడు నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. అది సరియైనది కాదు గ్రహించాలి. కావున ఈ క్రింది వాస్తవాలు పరిశీలించాలని కోరుచున్నాను. తేది. 24-02-2018 నుండి మొదలుకొని తేది. 02-11-2018 వరకు జరిగిన విషయాలు ఇంతకు ముందు తెలియజేశాను. ఆ తర్వాత తేది. 14-11-2018న దేశవ్యాప్తంగా బ్రహ్మాండమైన ర్యాలీలు నిర్వహించి సి.జి.ఎం/పి.జి.ఎం/జి.ఎం. గార్లకు మన సమస్యలపై కలుగజేసుకోవాలని వినతి పత్రాలను అందజేశాము. అయినప్పటికీ బి.ఎస్.ఎన్.ఎల్./ డాట్ మరియు గౌరవనీయులైన మంత్రి గారి నుండి మన సమస్యలపై స్పందన రాలేదు. కేంద్ర ఏ.యు.ఎ.బి. నాయకులు తిరిగి ఆలోచించి తేది. 15-10-2018న ఒక సంయుక్త నిర్ణయం తీసుకొని తేది. 03-12-2018 నుండి నిరవధిక సమ్మెలో వెళ్ళగలమని సి.ఎం.డి/డి.ఓ.టి.గార్లకు నోటీసు ఇవ్వడం జరిగింది. అప్పుడు కూడా చర్చలకు పిలుపు రాలేదు. దీనిని గ్రహించి కేంద్ర నాయకులు తేది. 24-11-2018 నుండి రాష్ట్రాలలో సమాశాలు జరిపి సమ్మె గూర్చి వివరించినారు. దీనికి సర్కిల్, జిల్లా, బ్రాంచ్ నాయకులు కూడా సాహసోపేతమైన ప్రచారం చేశారు. దాని వల్ల అన్ని రాష్ట్రాలలో సమ్మె గూర్చి మంచి స్పందన వచ్చింది వాస్తవం. దీనిని ఎవ్వరూ కాదనలేరు. దీనికి సహకరించిన వారందరికీ సర్కిల్ యూనియన్ విప్లవాభివందనాలు తెలియజేస్తుంది.

పరిస్థితిని గ్రహించి సి.ఎం.డి. బి.ఎస్.ఎన్.ఎల్. గారు ఏ.యు.ఎ.బి. నాయకులను తేది. 02-12-2018 (ఆదివారం)న చర్చలకు పిలిచారు. చర్చలు మ॥ 12.00 గంటల నుండి ప్రారంభమైనాయి. అన్ని సమస్యలపై సుధీర్ఘంగా చర్చించిన ఫలితం కనబడలేదు. అప్పుడు ఏ.యు.ఎ.బి. నాయకులు ఎన్.ఎఫ్.టి.ఇ, ఆఫీసులో సమావేశమై సమ్మెను జయప్రదం చేయాలనే దానిపై ఆలోచిస్తుండగా, అడిషనల్ సెక్రటరీ డి.ఓ.టి. నుండి చర్చలకు పిలుపువచ్చింది. నాయకులు వారితో మన సమస్యలపై సుదీర్ఘంగా రెండు గంటలు చర్చించినారు. అప్పుడు మన సమస్యలపై కొంత స్పష్టత కనబడింది. అయినా సమ్మె నిర్ణయంలో మార్పు లేదని మన నాయకులు తెలియజేశారు. అదే సమయము అనగా సా॥ 5.30 గంటలకు డి.ఓ.టి. సెక్రటరీ గారు స్వయంగా చర్చలలో పాల్గొని తేది. 03-12-2018 నుండి తలపెట్టిన సమ్మె చేయవద్దని విజ్ఞప్తి చేశారు. మన డిమాండ్లలో బి.ఎస్.ఎన్.ఎల్.కు 4జి స్పెక్ట్రమ్ కేటాయించుట, పెన్షన్ రివిజన్, వేజ్ రివిజన్‌తో సంబంధం లేకుండా అమలు చేయుట, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పెన్షన్ కంట్రిబ్యూషన్ యాక్చువల్ బేసిక్ పై ఇచ్చుట గూర్చి చర్యలు తీసుకున్నామని అవి తొందరలో పరిష్కారం కాగలవని కూడా చెబుతూ బి.ఎస్.ఎన్.ఎల్.లో కొత్తగా చేరిన వారికి రావలసిన 7% పెన్షన్ కంట్రిబ్యూషన్‌లోని భాగంగా 3% ను మార్చి 2019 లోగా ఇస్తామని మిగతా 4% వచ్చే ఫైనాన్సియల్ ఇయర్ లో ఇస్తామని చెప్పినారు. ముఖ్యంగా 3వ పి.ఆర్.సి. /వేజ్ రివిజన్ గూర్చి తేది. 06-11-2018న డి.ఓ.టి. నుండి వచ్చిన ఉత్తరం గూర్చి ఆందోళన పడవద్దని చెప్పినారు. దానిని మేము లెక్కలోకి తీసుకోవడం లేదని కూడా స్పష్టంగా చెప్పినారు. అదే సమయంలో గౌరవనీయులైన మంత్రి గారి నుండి ఒక సమాచారం వచ్చింది. దానిలో రేపు అనగా తేది. 03-12-2018న మ॥ 12.00 గం॥లకు ఏ.యు.ఎ.బి. నాయకులను కలిసి 3వ పి.ఆర్.సి./ వేజ్ రివిజన్‌పై చర్చిస్తానని చెప్పారు. అప్పటికీ రా॥ 8.00 గం॥లు దాటింది. ఏ.యు.ఎ.బి. నాయకులు తిరిగి పునరాలోచించుకొని మొదట సమ్మెను ఒక వారం రోజుల పాటు వాయిదా వేయాలని అనుకున్నారు. ఇది వాస్తవం. ఇందులో కట్టు కథలు లేవు.

తేది. 03-12-2018న గౌ॥ మంత్రి గారితో చర్చలు జరిగినవి. వారు తెలియజేసింది దానిలో ముఖ్యంగా 15% ఫిట్‌మెంట్‌తో వేజ్ రివిజన్‌కు "అఫర్‌డెబిలిటీ క్లాజ్"ను మినహాయించుటకు క్యాబినేట్‌కు తీసుకుని వెళ్ళినచో "రిజక్టు" అయ్యే ప్రమాదమున్నదనీ తెలియజేస్తూ, ఏ.యు.ఎ.బి. నాయకులు దీనిపై తిరిగి విచారించుకోవాలని కోరారు. ఎందుకంటే బి.ఎస్.ఎన్.ఎల్. ఆర్థిక పరిస్థితి డి.పి.ఇ. గైడ్ లైన్స్‌కు అనుగుణంగా లేవు. కావున పెన్షన్ కంట్రిబ్యూషన్ ఆన్ యాక్చువల్ బేసిక్‌పై రావడానికి తాను సంబంధిత అధికారులతో మాట్లాడినానని, దాని వలన బి.ఎస్.ఎన్.ఎల్.కు కొంత ఆర్థిక వనరులు సమకూరుతాయని, ఆదే విధంగా 4జి స్పెక్ట్రమ్‌ను తొందరలో బి.ఎస్.ఎన్.ఎల్.కు రావడానికి తన వంతు కృషి చేశానని చెప్పారు. ఈ రెండింటి వల్ల బి.ఎస్.ఎన్.ఎల్. నష్టాలు కొంత తగ్గి లాభ బాటలో వస్తుందని క్యాబినేట్‌కు తెలియజేస్తే 3వ పి.ఆర్.సి. / వేజ్ రివిజన్ తప్పక వస్తుందని చెప్పారు. అదే విధంగా అడిషనల్ సెక్రటరీ డి.ఓ.టి గారి అధ్యక్షతన కమిటీ వేసి పై విషయముల గూర్చి ఎప్పటి కప్పుడు రివ్యూ చేయాలని చెప్పారు. అదే విధంగా నాన్ ఎగ్జిక్యూటీవ్‌ల వేజ్ రివిజన్‌పై అగ్రిమెంట్ చేసి డి.ఓ.టి.కి పంపించాలని బి.ఎస్.ఎన్.ఎల్. అధికారులకు సూచన చేశారు. అది తొందరలో పూర్తి అవుతుంది. వేజ్ రివిజన్‌తో సంబంధం లేకుండా పెన్షన్ రివిజన్ చేయడానికి అంగీకరిస్తూ, తదుపరి చర్యల గూర్చి మంత్రి గారు అధికారులందరికి సూచనలిచ్చారు.

పైన తెలియజేసిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఏ.యు.ఎ.బి. నాయకులు మరి కొంత వ్యవధి ఇవ్వాలని రెండు గంటలు తర్జన భర్జన తర్వాత నిర్ణయించారు. కామ్రేడ్, కేంద్ర నాయకులు దేనిని గాలిలో వదలి వేయలేదు. సమ్మె వాయిదా వేయడం వల్ల నిరుత్సాహ పడ్డారు, వాస్తవం. వారిని ఎవ్వరూ తప్పు పట్టరని ఒక వేళ 10 రోజుల వరకు సమ్మె జరిగి ఫలితం రానిచో పరిస్థితిని ఊహించగలరు. ఏది ఏమైనా కొంత ఓర్పు అవసరం. ఆ తరువాత గౌ॥ మంత్రి గారు లోక సభ ఎన్నికలకు పిలుపు మార్చిలో రావచ్చునని సూచనా ప్రాయంగా తెలియజేశారు. తేది. 11-12-2018న ఏ.యు.ఎ.బి. నాయకులు ఎన్.ఎఫ్.టి.ఇ. ఆఫీసులో సమావేశమై చర్చలలో పురోగతిని పరిశీలించి సి.ఎం.డి. గారిని కూడా కలిసి వేజ్ రివిజన్‌పై చర్యలు తొందరగా తీసుకోవాలని కోరారు. అదే విధంగా మంత్రి గారితో జరిగిన చర్చలను, సర్కిల్ మరియు జిల్లాలలో సంయుక్త సమావేశాలు జరిపి సభ్యులకు తెలియజేయాలని కోరారు. ఒక వేళ భవిష్యత్తులో పరిస్థితిలో మార్పు లేనిచో నిరవధిక సమ్మె ఉంటుంది, గుర్తించాలి.

2. 5వ సర్కిల్ కార్యవర్గ సమావేశంలు తేది. 16-10-2018న నిజామాబాద్ పట్టణంలో ముదిరాజ్ భవనములో జరిగినది. ఈ సమావేశాలకు కా॥ కె. రాజరత్నం, కా॥ఎన్.కె. జైన్, కా॥ పంచాక్షరీ, కా॥ సాధిక్ మియా మరియు కా॥ బుచ్చిరెడ్డి గార్లు అధ్యక్షవర్గంగా వ్యవహరించినారు. వాటిని నిర్వహించుటకు సహకరించిన కా॥ మస్తాన్ వలీ జిల్లా కార్యదర్శి మరియు జిల్లా కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మొదట జెండావందన కార్యక్రమం సి.ఎస్.సి. నిజామాబాద్ ఆవరణలో జరిగినది. కా॥ సర్కిల్ కార్యదర్శి జాతీయ జెండాను ఎగురవేయగా, కా॥ చందేశ్వర్ సింగ్ ప్రధాన కార్యదర్శి గారు ఎన్.ఎఫ్.టి.ఇ. జెండాను ఎగురవేసారు. ఈ సమావేశాలకు ఇద్దరు జిల్లా కార్యదర్శులు తప్ప అందరు హాజరైనారు. 5గురు సర్కిల్ కార్యవర్గ సభ్యులు మినహ మిగతావారందరు హాజరైనారు. కా॥ చందేశ్వర్ సింగ్ ప్రధాన కార్యదర్శి మరియు కా॥ వి.కె. ముత్తు ఆల్ ఇండియా ఇన్వైటీ గార్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సర్కిల్ కార్యదర్శి మాట్లాడుతు రాష్ట్రంలోని సమస్యలు మరియు నిర్మాణ కార్యక్రమాలపై వివరణ ఇచ్చారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శులు యూనియన్ నిర్మాణ సమస్యలపై తమ అభిప్రాయాలు స్పష్టంగా తెలియజేశారు. కా॥ సి.సింగ్ గారు ఆల్ ఇండియా సమస్యలైన 3వ వేజ్ రివిజన్,పెన్షన్ రివిజన్, పెన్షన్ కంట్రిబ్యూషన్ ఆన్ యాక్చువల్ బేసెస్ బి.ఎస్.ఎన్.ఎల్.కు 4జి స్పెక్ట్రమ్‌ను ఇచ్చుట గురించి మరియు 2వ పి.ఆర్.సి.లో మిగిలియున్న సమస్యలపై వివరంగా తెలియజేశారు. సర్కిల్ కార్యదర్శి మాట్లాడుతూ 3 వ వేజ్ రివిజన్‌పై తేది. 24-02-2018 నుండి తేది. 02-11-2018 వరకు జరిగిన చర్చల గూర్చి వివరంగా తెలియజేయుట జరిగింది. మధ్యాహ్నం జరిగిన బహిరంగ సమావేశమునకు శ్రీ కళ్యాణ్ జి.ఎం. గారు మరియు శ్రీ ముస్తాఫా డి.జి.ఎం.(టెక్) గారు వచ్చి బి.ఎస్.ఎన్.ఎల్. బాగోగుల గూర్చి చేయవలసిన పనులపై వివరణ ఇచ్చారు. తరువాత వరంగల్ జిల్లాలోని సమస్యలు పరిష్కారం కాకుండా ఉంటే డిసెంబర్ 3, 4 తేదీలలో ధర్నాకార్యక్రమము చేయాలని తీర్మానించినారు.

ఈ సమావేశంలో మహబూబ్‌నగర్, సంగారెడ్డి మరియు నిజామాబాద్ జిల్లా కార్యదర్శులు రూ. 3000 చొప్పున సర్కిల్ యూనియన్‌కు విరాళం ఇచ్చినారు. వారికి ధన్యవాదములు. ఈ సర్క్యులర్ వ్రాయు నాటికి వరంగల్ జిల్లాలో ఒక సమస్య పరిష్కారం అయినది. రెండవది పరిష్కరించుటకు సర్కిల్ అధికారులతో మాట్లాడుచున్నాము. ఈ సమావేశంలో ముఖ్యముగా మెడికల్ పాలసీపై చాలా చర్చ జరిగింది. దీనిపై కేంద్ర యూనియన్ సరియైన చర్య తీసుకోవాలని జిల్లా కార్యదర్శులు కోరినారు. సర్కిల్ కార్యవర్గము సజావుగా జరుపుటకు సహకరించిన నిజామాబాద్ కామ్రేడ్‌లకు మరో సారి విప్లవాభివందనములు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా ఈ సమావేశములో ఆహ్వాన సంఘం వారు అతిథులకు, జిల్లా కార్యదర్శులకు, సర్కిల్ కార్యవర్గ సభ్యులను శాలువ మరియు "బ్యాగ్" ఇచ్చి సత్కరించినారు. కా॥ రాజన్న గారి వందన సమర్పణతో సమావేశములు ముగిసినవి.

3. తేది. 17-10-2018న ఆదిలాబాద్ పట్టణములో కా॥ సుభాష్ జిల్లా కార్యదర్శి మరియు వారి సభ్యులు కా॥ విలాస్ గారి అధ్యక్షతన సమావేశము ఏర్పర్చినారు. అది జి.ఎం.టి.డి. ఆవరణలో జరిగినది. దీనికి అన్ని యూనియన్ల జిల్లా కార్యదర్శులు అధికారులు కూడా హాజరైనారు. కా॥ చందేశ్వర్ సింగ్ ప్రధాన కార్యదర్శి, కా॥ వి.కె. ముత్తు ఆల్ ఇండియా ఆహ్వానితులు సర్కిల్ కార్యదర్శి, కా॥ ఎన్.కె. జైన్ సర్కిల్ ఉపాధ్యక్షులు మరియు కా॥ ఎన్. వెంకటేశ్వర్లు ఎ.సి.ఎస్. గార్లు హాజరైనారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి 150 మందికి పైగా సభ్యులు హాజరైనారు. ప్రధాన కార్యదర్శి గారు తనదైన శైలిలో హిందీలో అన్ని సమస్యలపై వివరణ ఇచ్చినారు. సర్కిల్ కార్యదర్శి ఆల్ ఇండియా సమస్యలైన 3వ వేజ్ రివిజన్ పై జరగబోవు సమ్మె గురించి పూర్తి వివరాలతో మాట్లాడినారు. దీనిలో క్యాజువల్ మజ్దూర్ల సమస్యలపై కూడా వివరణ ఇవ్వడం జరిగింది. కా॥ సుభాష్ జిల్లా కార్యదర్శి గారి వందన సమర్పణతో సమావేశం ముగిసినది. ఇది నిర్వహించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

4. తేది. 15-10-2018 నుండి 17-10-2019 వరకు తెలంగాణ రాష్ట్రానికి విచ్చేసిన కా॥ చందేశ్వర్ సింగ్, ప్రధాన కార్యదర్శి గారికి, కా॥ వి.కె. ముత్తు ఆల్ ఇండియా ఆహ్వానితుల గారికి మరియు ఈ సమావేశంలు సజావుగా జరగడానికి సహకరించిన సర్కిల్ యూనియన్ నాయకులకు కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఉద్యమాభివందనములతో...

**(ఎ.రాజమౌళి)**
సర్కిల్ కార్యదర్శి,
తెలంగాణ సర్కిల్, హైదరాబాద్.

**ఎన్.ఎఫ్.టి.ఇ. - జిందాబాద్ / కార్మికుల ఐక్యత - వర్ధిల్లాలి / బి.ఎస్.ఎన్.ఎల్. లాంగ్ లీవ్**